# తెర

"నేను సంగీత విద్వాంసుడ్నండీ" అన్నాడా పెద్దమనిషి తలెత్తి చేసేను. పొందూరు ఖద్దరు ధోవతీ, లాల్చీ, కండువా, ముఖాన్న విభూతి రేఖలు, వాటి మధ్యని కుంకుమ బొట్టు. దుస్తులు కొద్దిగా మాసినట్లుగా అనిపించింది. "చెప్పండి" అన్నాను. "పండిత పామర రంజకంగా ఓ కచేరీ చెయ్యాలని సంకల్పం, అందుకు మీ సహాయం వుంటే..." మాటని పూర్తి చేయ్యకపోయినా అతని వుద్దేశం తెలిసింది. గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది. అయిష్టంగానే అయినా నా వుద్దేశాన్ని స్పష్టంగా చెప్పక తప్పలేదు. "అయ్యా, యీ వూర్లో రసజ్ఞులు అనే వాళ్ళు అస్సలు లేనేలేరు. ఇక్కడున్న వాళ్ళందరివీ బొత్తిగా చవకబారు అభిరుచులు. ఇలాటివాళ్లకి శాస్త్రీయ సంగీతం వినిపించడం అంటే, చెవిటిముందు, శంఖం వూదినట్లే. మీ సభరాసభాసు కావడం తప్పవేరే ప్రయోజం ఏదీ వుండదు. అంచేత నేననే దేమిటంటే, మీ పాండిత్యానికి గుర్తింపుగా ఏదో తృణమో, పణమో చేతులో పెడ్తాం. దాంతో తృప్తిపడి మరేదేనా వూరికి వెళ్లి మంచి శ్రోతలముందు కచేరీ చేస్కోండి" అన్నాను.

నా మాటలకి విద్వాంసుడు బాగా చిన్నబుచ్చుకున్నట్టు కనిపించేడు. కాసేవు నిశ్శబ్దంగా కూర్చొని ఓ నిట్టూర్పు విడిచి "అయ్యా! నాకు డబ్బు ముఖ్యం కాదండీ! అవసరమైతే ఆకలైనా భరిస్తానుగాని, నా విద్యని గమనించని వాళ్లనుండి, వాళ్లిచ్చే దాన్ని వుత్తి పుణ్యాందానంగా మాత్రం స్వీకరించలేను. ఇలా అన్నందుకు మన్నించండి. తమకి వీలుపడితే నా కచేరీ యేర్పాటు చేయించి, పాటపూర్తియినాక యివ్వదలుచుకున్నదేదో యివ్వండి. అలావీలు పడదంటారా, నా దారిన్నేను పోతాను."

ఇదేం తిక్కమనిషిరా అనిపించింది మా వూరి జనాలకి చవకబారు అభిరుచులు తప్ప, మంచి అభిరుచుల్లేవని చెప్పినా అర్థం చేస్కోడే! అయితే ఆయన్ని చూస్తుంటే మాత్రం ఎందుకో ఆర్ద్రభావం కలిగింది. అతని అభ్యర్ధనని కాదనడానికి మనస్సు అంగీకరించలేదు. కాసేపు నాలోనేనే తర్కించుకొని యిలా అన్నాను. "మీ పాట కచేరీ యేర్పాటు చేయిస్తాను గాని ఓ షరతుకి మీరంగీకరించాలి. విద్వాంసుడిచేత కచేరి చేయించి, అతను మనసులో బాధపడేలా చేయ్యడం, నా కిష్టం వుండదు. అంచేత మీరు తెరవెనకాతల కూర్చుని కచేరీ చెయ్యాలి. తెరకివతల మా అలగాజనం కూర్చొని మీ పాట వింటారు. మా వాళ్లు మీ పాటకి ఏరకంగా స్పందిస్తారో మీ కళ్లబడకుండా వుండడమే మంచిది. ఒక వేళ మీ అదృష్టంబావుండి, మీ పాట

కచేరీ రక్తి కట్టిందనుకోండి, అంతకన్నా కావలసిన అదృష్టం ఏంవుంటుంది?'' అన్నాను.

షరతుకి అంగీకరించేడు పండితుడు. అతగాడికి తన పాండిత్యంమీద, సమ్మోహన శక్తి మీదా వున్న విశ్వాసం చూస్తుంటే నాకు నిజంగా ఆశ్చర్యం వేసింది. నవ్వూవొచ్చింది.

సరే మావూరు స్కూల్లో సంగీత సభా కార్యక్రమం యేర్పాటు చేయించేను. విశాలంగా వున్న ఒక హాలులో బల్లల్తో స్టేజి కట్టించి, దానికి ముందుగా తెర యేర్పాటు చేయించాను. పంచాయితీ ప్రెసిడెంట్లు ఎటువంటి రావణాసురో మీకు తెలియందికాదు. మావూరి పంచాయితీకి నేను సర్పంచ్‌ని. ఏతావాతా మా వూర్లో నా మాట సుగ్రీవాజ్ఞ. నా పిలుపుని చచ్చినట్టు మన్నించి, వూరిజన వల్లా - అంటే ముసలీ, ముతక, పిల్లా జెల్లా అంతా విచ్చేశారు సభకి. విద్వాంసుడు యింకా స్కూలు ప్రాంగణం చేరుకోలేదప్పటికి. నేను మైకు అందుకొని చెయ్యవలసిన హెచ్చరిక చేసేను, " ఇష్టంవున్నా లేకపోయినా చచ్చినట్టు కూర్చుని సంగీతం వినవలసిందే. ఎవరైనా బరితెగించి పిల్లికూతలు, కుక్కకూతలు కుయ్యడంగాని, వెకిలి నవ్వులు నవ్వడంగాని చేశారో - అటు వంటి అల్లరికి దిగిన వాళ్లకి తగిన శాస్తి జరుగుతుంది. ఆనక ఏడ్చి, మొత్తుకుని లాభంలేదు.'' ఈ వార్నింగ్ వజ్రాయుధంలా పనిచేసింది - చేరిన జనంలోంచి ఒక్కడంటే ఒక్కడు కూడా కిక్కురుమనకుండా, కుక్కిన పేలల్లా కూర్చున్నారు సభ జరుగుతున్నంత సేపున్నూ.

ఇక్కడ నేను అతిగోప్యంగా దాచుకువస్తున్నా స్వవిషయం మనవిచేస్తాను. ఈ పల్లెటూరి రాజకీయాల్లోకి ప్రవేశించేక తప్పనిసరిగా దాదాగిరీ చెలాయించవలసివస్తోంది. కాని నేను మద్రాసులో చదువువెలగ బెట్టిన రోజుల్లో నా అవతారం మరోలావుండేది. చెప్పొద్దూ, నాకు కర్నాటక సంగీతమంటే ఎంతో యిష్టం . మద్రాసులో జరిగే ప్రతి సంగీత కచేరీకి విధిగా హాజరవుతూ వుండేవాడ్ని, అంచేత చెప్పొచ్చే దేవిటంటే, మంచి సంగీతం తాలూకా ఆనుపానులన్నీ నాకు బాగా తెలుసు.

కచేరీ ఆరంభంవయింది. విద్వాంసుడు హంసధ్వని రాగంలో 'వాతాపి గణపతింభజే' ఎత్తుకున్నాడు. అతని ఎత్తుబడి విధానం చెవిన పడీపడగానే గ్రహించేశాను యితగాడు నిజంగానే కృషీ, పాండిత్యం వున్న విద్వాంసుడని. అయితే యేంలాభం? తెరకి యివతల కూర్చున్న వాళ్ల అసలు సిసలైన అలగాజనం, కేకలు, ఈలలు, అరుపులు, గెంతులు సంగీతంగా చెలామణి అవుతున్న వాతావరణంకి అలవాటుపడ్డ వాళ్ల వీళ్లంతా, విద్వాంసుడి ఆలాపనల్లో వినపడుతున్న సొగసులు వాళ్లకేం తెలుస్తాయి? ముత్యాల్లాంటి కీర్తనలు గానం చేసినా, జనాల్నుంచి ఏ రకమైన ప్రోత్సాహం, స్పందనా లభించక పోవడంతో బాగా నిస్పృహ పడిపోయేడు విద్వాంసుడు.

సభ ముగిసింది. హర్షధ్వానాలు, కరతాళధ్వనులు యిలాటివేవీలేవు. నాకూ, నా దాదాగిరికి జడిసిన జనాలు కిక్కురు మనకుండా స్కూలు బిల్డింగు ఖాళీచేసి వెళ్లిపోయేడు.

తెరతప్పించి విద్వాంసుడ్ని చూద్దునుకదా, కన్నీళ్లతో ఎంతో దయనీయంగా కనిపించేడు. ఎటువంటి జనాన్నైనా సరే, తన సంగీత మాధుర్యంతో మంత్రముగ్ధుల్ని చెయ్యగలనని ఆయనగాని భావించివుంటే, నిజంగానే ఆయన ప్రజ్ఞకి శృంగభంగంవయింది.

నన్నుచూసి గద్గస్వరంతో యిలా అన్నాడు! "అయ్యా, నాకుతెలీలేదు - నా కచేరీ యింతలా అరణ్యరోదనమవుతుందని. మన్నించండి - తమని బోలేడు శ్రమ పెట్టినందుకు. అయినా మీరు అన్యధాభావించనంటే మరొక్క చిన్నప్రార్థన" అని ఆగేడు. నీరు నిలిచిన అతని కళ్లల్లోకి చూడగానే అతని కోరిక ఎటువంటి దేనా తీర్చాలని ఆవేశం కలిగింది. "చెప్పండి - నేనేం సహాయం చెయ్యగల్నో" అన్నాను.

"మరేంలేదు - రేపు మళ్లీ మరొక్క సారి యీ శ్రోతల్తోనే సభ ఏర్పాటు చేయించండి. ఇవాల నా పాటకి తట్టుకోలేక తలలు పట్టుకున్న యీ శ్రోతలే, రేపు నా పాట విని సంతోషంతో ఎగిరిగంతులు వెయ్యక పోతే చూస్కోండి - నా ప్రాణాలు తీసి మీ ముందు పెడతాను".

పరాజయం అతన్ని అంతలా కలచివేసినందుకు చాలా బాధపడ్డాన్నేను. అతన్ని ఎలా వూరడించడం? మెరుపులా ఓ ఆలోచన మెరిసింది. ఎలాగైనా అతగాడికి తృప్తి కలిగించి మరీ మా వూరినుండి పంపించాలి - అదీ నా నిర్ణయం. మనసులో అప్పటి కప్పుడే ఓ పథకం రూపుదిద్దుకుంది. అంచేత విద్వాంసుడు కోరిన విధంగా మర్నాడు మళ్లీ కచేరీ ఏర్పాటు చెయ్యడానికి అంగీకరించేను. అయితే షరా మామూలే అని చెప్పేను. "తెర వెనుక భాగోతమేకదా - అలాగే కానివ్వండి. "అన్నాడు పండితుడు."

అతగాడి గొంతులో కాస్త నిష్ఠూరం ధ్వనిగా వినపడింది. అనుకున్న ప్రకారం మర్నాడు మళ్లీ సభయేర్పాట్లు జరిగేయి. అయితే ముందురోజు జరిగిందానికీ, యివాల్టి సభకీ చాలా తేడావుంది.

వూరిజనాలు ఎవరూ రాకుండా జాగ్రత్త పడ్డాను. మా చుట్టుపట్ల వూళ్ళల్లో కొద్దిమందే అవుగాక - కొంతమంది రసజ్ఞులు, కవులు, మంచీ చెడూ తెలిసిన వాళ్లూ వున్నారు. అయితే యిలాటి వాళ్లందర్నీ వెతికిపట్టుకొని సభకి తెచ్చేటప్పటికి నాకు చచ్చినంత శ్రమయింది. ఇంతా చేస్తే హాజరైన వాళ్ల సంఖ్యనిచూస్తే నిండా పాతికమందిలేరు. జనం పల్చగా వున్నారని, ఏదో మేర్పానీకి ఏర్పాటు చేసిన కార్యక్రమంఅని విద్వాంసుడు గ్రహించకుండా వుండేందుకే మళ్లీ తెర వేయించడం జరిగింది.

అనుకున్న వేళకి కాస్త అటూ యిటుగా కచేరీ ఆరంభంవయింది. మొదటిపాట వినీవినగానే మూర్ఛవచ్చినంత పనయింది నాకు. ఓలొల్లాయి పాటని ఎత్తుకున్నాడు పండితుడు. సభలో తెరకి యిటు ప్రక్కన ఆసీనులైన రసజ్ఞులు ముఖాలు చూసుకోడం గమనించేను. పామర రంజకంగా పాడదాంవనుకున్నాడు కాబోలు, రెండోపాటని పండిత జనరంజకంగా పాడ్తాడులే అని కొద్దిగా సరిపెట్టుకున్నాను. రెండోపాటకి ఆలాపన ఆరంభంవయింది. శ్రావ్యంగా వుందని సభికులు తలలూగించేరు. ఆలాపన పూర్తయింది. హటాత్తుగా, మరో రెండర్థాల బూతుపాటని

ఎత్తుకొని, వూపిరి సలపనివ్వని వేగంతో పాటని పాడేడు పండితుడు. పాడిన విధానం భేషుగ్గా వున్నా, పాడిన పాట మాత్రం జగుప్సాకరంగా వుంది. నాకు చెమటలు పట్టేశాయి. తెరవెనక్కి పరిగెత్తి "ఇదేం పాటలండీ బాబూ! నిన్నటి పాండిత్యాన్ని ఏ తుంగలో తొక్కేశారు?" అన్నాను గాభరా పడిపోతూ. కోపంతోను, కసితోను కంపించిపోతున్న గొంతుకతో "ఏం, మీ జనాలకి యీ పాండిత్యంచాలదా? చాల్దంటే చెప్పండి, యింకాస్త ఘాటైన బూతుకూతలు నాలుగుపాడి వినిపిస్తాను." అన్నాడు రౌద్రంగా. సభరసాభాసైంది. వచ్చినవాళ్లు రసజ్ఞులయ్యా అని ముందుగా యితగాడికి చెప్పక పోడం పెద్ద పొరపాటు. వచ్చిన రసజ్ఞులు అభినందిస్తుంటే, యితను ఆశ్చర్యపోతూ వుంటే చూడాలని నేను వేసిన ఎత్తుగడ చిత్తయిపోయింది. సభకి విచ్చేసిన రసజ్ఞులముందు తలెత్తుకోడం ఎలాగా అని ఓ పక్క మధనపడిపోతూ, సమక్షానికి విచ్చేసిన పండితుడ్ని చీవాట్లు పెట్టి అవమానించలేక మరోపక్క బాధపడిపోతూ సభని అంతటితో ఆపుచేయించాను. గాయకుడికి అస్వస్థత చేసిందనీ, సభామర్యాదలు తెలియని అతని శిష్యుడు యేదో విధంగా కార్యక్రమం జరిగిందని పించాలనే వుద్దేశంలో యిలాటి లొల్లాయి పాటలు పాడేడని సర్దిచెప్పి సహృదయుల ముందు నా పరువు కాపాడుకోడానికి ప్రయత్నం చేశాను. విద్వాంసుడ్ని విడిగా కల్సుకొని, అతని చేతిలో ఓ అయిదువందల పదహార్లు కుక్కి, గుట్టు చప్పుడుకాకుండా రాత్రికి రాత్రే మనుషుల్ని తోడిచ్చి అతన్ని వూరినుండి పంపేశాను.

★✪★